# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.

2. శారీరిక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

3. సూక్ష్మ రుణ ప్రణాళిక ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.

4. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు.

5. తపాలా సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

==========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. ఈ సమావేశంలో క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం, వివిధ సంస్థలకు భూకేటాయింపులు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సీఆర్డీఏ సమావేశ నిర్ణయాలపై చర్చిస్తోంది. అలాగే కర్నూలు, నంద్యాల, అనంతపురం, విజయనగరం జిల్లాల్లో పునరుత్పాదక, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, జలవనరుల శాఖ ప్రాజెక్టుల మరమ్మతులకు నిధుల మంజూరు వంటి అంశాలపై చర్చించి మంత్రి వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి

--------------------------

శారీరిక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఏలూరు రోడ్డులో నిర్వహించిన“మానసిక ఆరోగ్యానికి నడక” కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

శారీరిక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజయవాడ ఏలూరు రోడ్డులో నిర్వహించిన“మానసిక ఆరోగ్యానికి నడక” కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 30సెకన్లు

---------------------------

సూక్ష్మ రుణ ప్రణాళిక ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలను అందించే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సముద్రపునాచు, వెదురు సాగు, మునగ ఆకు పొడి, చిరు ధాన్యాలు వంటి సహజ ఉత్పత్తులలో తగిన లక్ష్యాలను సాధించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానంతో రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

---------------------------

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలు భాగస్వా ములు కావాలని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ రెడ్డి అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 5కె మారథాన్ ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలకంఠ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి, నిర్మూలనపై విస్తృత ప్రచారం అవసరమన్నారు. యువతకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహనతో పాటు ప్రతి కళాశాలలు, విద్యాసంస్థల్లో కౌన్సిలింగ్ కార్యక్రమలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను – జీఎస్టీ తగ్గింపుల ద్వారా ప్రజలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అన్నారు. ఎన్టీఆర్ జిల్లా అనాసాగరం గ్రామంలో నిర్వహించిన “సూపర్ జీఎస్టీ –సూపర్ సేవింగ్స్” కార్యక్రమంలో ఆమె ఈ రోజు పాల్గొని స్థానికులకు సూపర్ జీఎస్టీకి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీఎస్టీ సంస్కరణలు సామాన్య ప్రజలతో పాటు, వ్యాపార వర్గానికి మేలు చేకూర్చే విధంగా ఉన్నాయని చెప్పారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటిస్తారు. ఈ మధ్యాహ్నం అమరావతి సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి జిల్లాలోని వెంకటాచలం మండలం, ఎడగాలి గ్రామానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా అక్కడ నిర్మించిన నంద గోకులం పాఠశాలను ప్రారంభించి పాఠశాల విద్యార్థులతో ముఖ్యమంత్రి సంభాషిస్తారు. అనంతరం అక్కడికి సమీపంలోనే గోశాలలో నంద గోకులం సేవ్ ద బుల్ ప్రాజెక్టును, ఎడగాలిలో నూతనంగా నిర్మించిన విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

---------------------------

తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోషణ్ అభియాన్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గర్భిణీ స్త్రీలకు, బాలింత మహిళలకు పౌష్టిక ఆహార ప్రయోజనాలను, తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు గురించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు వసంతబాయి మాట్లాడుతూ, జిల్లాలోని 2,492 అంగన్వాడీ కేంద్రాలలో ఈ పోషణ్ మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాయిస్ 31 సెకన్లు

---

తపాలా సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసీ 1854 సంవత్సరంలో స్థాపించిన భారతీయ తపాలా శాఖ ..... ఇంత కాలంగా పోషిస్తున్న పాత్రను స్మరించుకోవడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారత దేశంలో నగర ...., పట్టణ ...., గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా మారు మూల ప్రాంతాలకు సైతం తపాలా శాఖ అందిస్తున్న సేవలు ఎంతైనా చిరస్మరణీయం. వినూత్న సేవలతో తపాలా శాఖ రోజు రోజుకీ ప్రజలకు మరింత చేరువ అవుతోంది. బ్యాంకులతో సమానంగా ప్రస్తుతం ప్రజలకు తపాలా సేవలు అందుతుండడం ప్రశంసనీయం.

---

కర్నూలు జిల్లాలో ఈ నెల 16 వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ. సిరి తెలిపారు. ప్రధానమంత్రి పర్యటించనున్న "నన్నూరు"గ్రామం వద్ద పార్కింగ్, హెలిప్యాడ్, సభా ప్రాంగణం ఏర్పాట్లను కలెక్టర్ నిన్న పరిశీలించారు. శ్రీశైలంలో భ్రమరాంభికా మల్లికార్జున స్వామి వార్లను దర్శనం చేసుకున్న తర్వాత, నన్నూరు బహిరంగ సభా ప్రాంగణానికి ప్రధానమంత్రి చేరుకుంటారని తెలిపారు. 3 లక్షల మందికి సరిపడేలా సభా ప్రాంగణం సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలియజేస్తూ, వాయిస్ 30 సెకన్లు

---

యువతలో పొగాకు వాడకం తగ్గించేందుకు "పొగాకు రహిత యువత ప్రచారం 3.0" కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. ఢిల్లీలో "పొగాకు రహిత యువత ప్రచారం 3.0" కార్యక్రమాన్ని ఆమె నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా యువతకు పొగాకు వాడకాన్ని నిరోధించడంపై అవగాహన కల్పించడం, మానేయాలనుకునే వారికి సహకారం అందించడం, పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలుపై ప్రచారం నిర్వహించడం వంటివి ఈ ప్రచార కార్యక్రమం ద్వారా నిర్వహించనున్నామని తెలిపారు.

---

విశాఖపట్నంలోని రుషికొండలో భవనాలను వినియోగించే మార్గాలపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమావేశమైంది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా భవనాలను ఎలా వినియోగించాలనే అంశంపై మంత్రి వర్గ ఉపసంఘం చర్చించి ప్రభుత్వానికి సిఫారసులు అందించనుంది.

దక్షిణ ఒడిశా నుండి మన్నార్ గల్ఫ్ వరకు ఉన్న ద్రోణి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కొనసాగుతోందని. అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజులపాటు ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ పేర్కొన్నారు.

======================